


# ప్రముఖాంధ్ర

**ప్రపంచ తెలుగుల మానస పత్రిక**

జూన్ 2016

సంపుటి : 22 **258** సంచిక : 6




## ప్రాధమిక పాఠశాలల నుంచే మాతృ భాషాధ్యయనం కొనసాగాలి!
## ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందించాలి!

**- అంకిత భావం గల బోధనాధ్యాయులు ఉండాలి! నాణ్యమైన ప్రాధమిక విద్యాబోధనం జరగాలి! -**

ప్రాధమిక పాఠశాలల బోధనం నుంచే విద్యార్ధుల్లో చక్కని అధ్యయనం ప్రారంభమవుతుంది. ఆసక్తి కలుగుతుంది! ప్రాధమిక పాఠశాలలే విద్యారంభానికి పునాదులు వేస్తాయ్. ఏ అక్షఱజ్ఞానమూ మాతృభాషాధ్యయనం లేకుండా కలుగదు. ప్రైవేటు బడులు ఒకే సిలబస్ పాటించిననాడు బోధనా పోటీ ఉంటుంది. పటిష్టమైన బోధనం ఉంటుంది. ఐదవ తరగతి వరకూ ఏ అంశములూ మాతృభాషలోనే నాణ్యమైన విద్యను బోధించాలి. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలు ఉన్నప్పుడే పోటీ ఉంటుంది. ఉపాధ్యాయులు ఉన్నత ప్రమాణంలో విద్యార్ధులను తీర్చిదిద్దుతారు, ప్రభుత్వ పాఠశాలలూ ప్రైవేటు పాఠశాలలూ రెండు విద్యార్ధులను అపార ప్రజ్ఞావంతులుగా రూపొందిస్తారు.

విద్యాబోధనలో పోటీ ఉన్నప్పుడే ఉన్నత ప్రమాణాలు గల విద్యను అభ్యసించే అవకాశం ఉంటుంది. వీటికి పునాదులు వేసేది ప్రాధమిక విద్యయితే ఊపిరి పోసేది మాతృభాష.

మాతృభాషను విస్మరించడం వల్లనే ప్రాధమిక పాఠశాలలు విద్యార్ధి భవిష్యత్తును అంధకార బంధురం చేస్తున్నాయ్. తల్లి తండ్రులు తమ బిడ్డల ఉపాధిని దృష్టిలో పెట్టుకుని మాతృభాషపై అలక్ష్యంగా ఉంటు న్నారు. ఈ జాడ్యము తెలుగువారిలోనే యెక్కువగా ఉన్నది.

చెన్న పట్టణంలో త్యాగరాజ, రామకృష్ణా మిషను, వేలన్‌కన్ని, శారద, కేసరీ, కన్యకా పరమేశ్వరి, దివాన్ బహద్దూర్ కలవల కణ్ణన్ చెట్టి, డి.జి. వైష్ణవ, జవహర్ విద్యాలయ ఆంధ్ర మహిళా సభ, తెలుగు మహాజన సమాజం వంటి సంస్థలెన్నో చక్కని తెలుగు బోధనా తరగతులు గల పాఠశాలలను నిర్వహించారు. చెన్న పట్టణంలో ప్రామాణికమైన తెలుగును బోధించే పాఠశాలలు అటు ఆంధ్రా, నైజాము, రాయలసీమల్లో అరుదుగా ఉండేవి.

తెలుగు విద్యార్ధుల ఉత్తీర్ణ శాతం చెన్నపట్టణంలోనే యెక్కువగా ఉండేది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉన్నప్పుడు కోస్తాంధ్రాల్లో చక్కని తెలుగు బోధన ఉండేది. వెంకట్రామా అండు కో, రామా అండు కో పోటీపడి చక్కని తెలుగు వాచకాల్ని ప్రచురించేవారు. ఉపాధ్యాయులకు చక్కని శిక్షణ యిచ్చే ప్రారంభ విద్యల్లాంటి మాసపత్రికలుండేవి.

భాషా రాష్ట్రాలు విడివడిన తరువాత భాషా బోధనంలో తిరోగ మించిన భాష తెలుగు భాష. ప్రభుత్వాలు నాయకులూ అలక్ష్యం చూపబడిన భాష తెలుగు భాష.

స్వభాషాభివృద్ధి కొరకు దేశాన్నే విడగొట్టినవారు తెలుగువారు. ఏ భాష కోసం పోరాడారో, ఆ భాషాభివృద్ధి కోసం కించిత్తు ప్రయత్నం చేయలేదు, చేయాలనుకోవడం లేదు. కొంత కాలానికి తెలుగును కనిపించకుండా చేస్తారేమోనన్న సందేహం కలుగుతున్నది. మాతృ మూర్తి పట్ల అనాదరణంగా ఉండడం మాతృభాష పట్ల అనా దరణగా ఉండడం రెండూ ఒక్కటే! ఇరువురూ తల్లి పాలు త్రాగుతూ రొమ్ము గుద్దేవారే, మాతృభాషా హంతకులే!



ఇంతకన్నా ఎక్కువగా వ్రాసి నా తెలుగు కలాన్ని క్షోభింపచేయను.

బుధజన విధేయుడు

**- గోటేటి శ్రీరామారావు**


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# హనుమంతుని బలాన్ని హనుమంతుడే ఎరగడు!

హనుమంతుని పేరు చెబితే భూతప్రేత పిశాచాలన్నీ భయపడి పారిపోతాయ్. ఆంజనేయుడు భక్తజన ప్రియుడు. తన్ను ఆరాధించిన వారికి వెన్నుదన్నుగా ఉంటాడు. **సంజీవనీపీఠాధీశురాలు మాతా కన్యామారి తలపెట్టిన 108 హనుమత్సాలీసా ఫలకాలను ప్రతిష్టింపబడేట్టుగా హనుమదానుగ్రహం ఆ అమ్మకు లభించింది.**

అందరికీ ఆరాధ్య దైవం ఆంజనేయుడు. ఆయనకు హనుమంతుడు, హనుమ, మారుతీ, అంజనీపుత్రుడు, వాయుపుత్రుడు, కేసరీ నందనుడు వంటి ఎన్నో పేర్లు ఉన్నాయి. శ్రీరామచంద్రమూర్తి కార్యాలన్నింటిని చక్కపెట్టినవాడు హనుమ. అందువల్ల శ్రీరామరక్ష అంటే ఆంజనేయ రక్ష, ఆ రక్షను ఆశించే, చంటిపిల్లల మెడలో ఆంజనేయస్వామి బిళ్లను కడతారు. ఆ బిళ్ళ రక్షాకవచంగా ఉంటుంది.

హనుమంతుడు అంజనాదేవి, వాయుదేవుల సంతానం. పుత్రునికోసం అంజనాదేవి అనేక సంవత్సరాలపాటు తపస్సు చేసింది. ఆ తపస్సుకు మెచ్చి, అంతకుముందు ఈశ్వరుడు రుద్రతేజాన్ని ఫలంరూపంలో ఆమె ముందు వుంచడంతో వెంటనే ఆ ఫలాన్ని అంజన ఆరగించింది. అమోఘమైన ఆ ఫలాన్ని ఆరగించడం వలన ఆమె గర్భవతి అయి సూర్యాది నవగ్రహాలు శుభస్థితిలో వున్న సమయంలో త్రిలోకపావనుడైన కుమారుని కన్నది. అతడే ఆంజనేయుడు.

హనుమ పుట్టిన సమయంలో సకల దేవతలు ఎంతో సంతోషించారు. ఒక రోజు తన బిడ్డ ఆకలి తీర్చడం కోసం ఫలాలను తీసుకురావాలని అంజనా వనంలోకి వెళ్లిన సమయంలో, అప్పుడే ఉదయిస్తున్న సూర్యబింబం వాయుపుత్రునికి ఒకపండులా కనిపించింది. దానిని తిందామనే భ్రాంతితో శరభంగా గర్జిస్తూ ఆకాశానికి ఎగిరాడు. లక్షయోజనాలు దాటుకుని సూర్యమండలానికి చేరుకున్నాడు మారుతి. సూర్యుడిలా అన్నాడు : ఈ బాలుడు ఆంజనేయుడు, సర్వలోకహితుడు. కేవలం శైశవ భావంతో నన్ను చూసి పండు అని భ్రమించి పట్టుకుందామనే కోరికతో ఉరుకుతున్నాడు. మీరు భయపడకండి అన్నాడు. ఇంద్రుడు ఆంజనేయునిపైకి తన వజ్రాయుధం విసిరాడు. అంజనీసుతుడు మూర్ఛపోయాడు.

ఇక్కడ పుత్రుని కోసం ఫలాలను తీసుకురావడానికి వెళ్లిన అంజన తిరిగి వచ్చి బాలునికోసం ఆరాటపడింది. అది చూసిన కేసరి 'అంజనా శోకించకు మన కుమారునికి వచ్చిన ముప్పు ఏమీ లేదు. నీ శోకాన్ని విడిచిపెట్టు, మనకు శుభం కలుగుతుంది' అన్నాడు. హనుమ మూర్ఛపోవటాన్ని చూసి వాయువు కూడా స్తంభించడంతో ఆ బ్రహ్మదేవుడు సమాధానపరిచాడు. హనుమశరీరాన్ని తన సుకుమార హస్తాలతో స్పృశిస్తాడు. ధరణి, వరుణుడు, యముడు, శంకరుడు, కుబేరుడు, విశ్వకర్మ వంటివారు హనుమంతునికి ఎన్నో వరాలిస్తారు. వీటిలో జరామరణాదులు లేకుండా చిరంజీవి అవుతాడని సూర్యపుత్రుడైన యముడు ఇచ్చిన వరం కూడా ఉంది. అందుకే ఆంజనేయస్వామికి మరణం లేదు. ఆయన ఇప్పటికీ హిమాలయాల అవతల పర్వతశ్రేణువుల్లో తపస్సుచేసుకుంటూ వుంటాడని పెద్దలు చెపుతారు. చివరగా బ్రహ్మదేవుడు ఆంజనేయునికి దీవెనలు ఇస్తాడు. ఆ తరువాత శ్రీరామచంద్రమూర్తి వనవాసం చేసినపుడు హనుమ వారికి ఎంతో అండగా ఉన్నాడు. సముద్రాన్ని దాటి లంకలో వున్న సీత జాడ తెలుసుకుని రామునికి ఆనందాన్ని కలిగించాడు. రావణునితో పోరు సమయంలో లక్ష్మణుడు మూర్ఛపోగా శ్రీరాములవారి ఆజ్ఞతో సంజీవిని పర్వతాన్ని ఎత్తుకుని వచ్చి లక్ష్మణుని ప్రాణాలు కాపాడాడు. పాండవులలోని భీమసేనుడికి ఆంజనేయుని హస్త స్పర్శ తగిలిన తర్వాతనే ఆ శక్తిబలం ఎన్నో రెట్లు పెరిగి కురుక్షేత్ర సంగ్రామంలో విజయాలను అందుకోగలిగాడు. బ్రహ్మచర్యవ్రతుడు, సూర్యతేజుడు, సకల విద్యాపారంగతుడు వ్యాకరణశాస్త్రమెరిగిన వాడని తొలిచూపులోనే శ్రీరాముడు లక్ష్మణునికి చెబుతాడు. హనుమంతుని నిత్యం ధ్యానించండి ఎటువంటి భయాలు దరిచేరవు.



# ఆది శంకరాచార్య జయంతి మే 11న వచ్చింది
# శ్రీ వైష్ణవమత స్థాపకాచార్య మే 12న వచ్చింది

ఉభయ ఆచార్యులూ వేదాన్ని కూలంకషంగా అధ్యయనం చేశారు. భగవంతుణ్ణి ఆరాధించ డంలో వివిధ మార్గాల నెన్నుకున్నప్పటికినీ, తిరుమల శ్రీవేంకటనాథుణ్ణి ఆరాధించి, తరించి నారు. ఒకరు ఆకర్షణ యంత్రాన్ని ప్రతిష్టాపనం చేసారు. మరొకరు శ్రీవెంకటేశ్వరుని తిరునామ ధారిగా తీర్చిదిద్దారు. అయితే తిరుమలలో వైఖానస పద్ధతిలోనే నిత్య ఆరాధనం జరుగు తుంది.

ఆది శంకరాచార్యులవారు తపః శక్తితో తిరుమల శ్రీనివాసుణ్ణి సందర్శించి అర్చించగా, ఆది రామానుజులవారు తమ పాదాలను మోపకుండా మోకాళ్ళతో ఏడుకొండల్నూ అధిరోహించారని ఇతిహాసికుల విశ్వాసం.


### కనకధారాస్తోత్రం

ఒక పేదరాలింటికి వెళ్ళి ఆదిశంకరాచార్యుల వారు బిక్షాన్ని యాచించారు. ఒక వస్త్రం ఆరవేసివుంటే మరొక వస్త్రం కట్టుకుని జీవిస్తున్న స్థితిలో ఉన్న ఆమె సిగ్గుతో చితికిపోతూ కళ్లనీరు కుక్కుకుంటూన్న స్థితిని శంకరాచార్యులవారు గమనించారో లేదో ఆమె ఇంటి పెరట్లో ఒక ఉసిరికాయ చెట్టునుండి పడింది.

ఆమె దాన్నే ఆచార్యులవారికి జోలెలో వేసింది.

అంతే! శంకరులవారు ఆ లక్ష్మీదేవిని తలచు కుని ఆశువుగా ఆమె ఇంటిముందే నిలబడి కనకధారా స్తోత్రాన్ని చెప్పేశారు. ఆమె ఇంటి నిండా బంగారు ఉసిరి కాయలు వర్షం పడినట్లు పడగానే ఆమెని ఆశీర్వదిస్తూ ముందుకు కదలిపోయారు శంకరులు.

'ఇంత బంగారాన్నిచ్చాను కదా! నా మాటే మిటి?' అని శంకరాచార్యులవారని వుండి వుంటే ఆయన్ని సన్యాసులుగా లెక్కించనవసరమే లేదు. సన్యాసులు ధనాన్ని స్వీకరించరాదనీ– పైగా గృహస్థులకే ఉండే ఆర్థికమాంద్యాన్ని తొలగించడం కోసం భగవంతుణ్ణి సంన్యాసి మన పక్షాన నిలబడి ప్రార్థించాలనీ మనకి చెప్పే ఈ సంఘటన మనకీ, సన్యాసులకి కూడా మార్గదర్శకం.




### న మాతుఃపరదైవతమ్

సన్యాసానికి ఏ తల్లి అనుమతినియ్యాలో ఆ తల్లి అనుమ తించి కొంతకాలమయ్యాక గతించింది.

శంకరుల వారికి మానసిక ప్రార్థనలో ఈ విషయం తెలిసింది. అంత్యక్రియలకి వెళ్ళవలసిన తాను ఎంతో దూరంలో ఉన్నారు. వెంటనే ధర్మలోపం జరుగకుండా వుండేందుకై ఆయన తన తపశ్శక్తిని వ్యయం చేస్తూ ఆకాశమార్గం ద్వారా తల్లి చితివద్దకి వచ్చారు.

అసూయాపరులైన దాయాదులంతా ఆశాస్త్రీయమం టూన్న వేళ ఆయన కుడిభుజాన్ని మధించి అగ్నిని రగు ల్కొలిపి ఆ మంటతో తల్లికి దహన సంస్కారాలని నిర్వర్తిం చారు. కాబట్టి సంన్యాసి అయినా మాతృ అంత్యక్రియలని చేసి తీరాలనేది మార్గదర్శకం.



### తననే రక్షించిన స్తోత్రం

ఆదిశంకరాచార్యులవారు ఒక క్లిష్టపరిస్థితిలో అమరుకుడనే రాజశరీరంలోకి చేరవలసిన (పరకాయ ప్రవేశం) అవసరం ఏర్పడింది. తన శరీరాన్ని ఒక చోట రహస్యంగా భద్రపరచి రాజశరీరంలో చేరా రయన. ఇది గమనించిన అసూయపరులు శంకరుల శరీరాన్ని గుర్తించి చితిమీద పెట్టి మంట పెట్టబోయారు. లక్ష్మీనృసింహ కరావ లంబ స్తోత్రాన్ని ఆశువుగా చదువుతూ స్వామీ! కరావలంబాన్ని (చేతిని ఊతగా ఈయడం) కోరుతున్నానంటూ దుః ఖంతో ప్రార్థించి – ఆ నృసింహుని కటాక్షం కారణంగా రాజశరీరాన్ని విడిచి తన శరీరంలోకి ప్రవేశించగలిగారు.

ఈ స్తోత్రంలోని అతి ముఖ్యమైన శ్లోకమని

**'ఏకేన చక్ర మపరేణ కరేణ శంఖ**
**మన్యేన సింధుతనయా మవలంబ్య తిష్ఠన్**
**వామేతరేణ వరదాభయపద్మ చిహ్నం**
**లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్ ॥**

దీన్ని చెప్పారు. 'ఓచేత్తో చక్రాన్నీ, మరో చేత్తో శంఖాన్ని మరోచేతిని నీ ఒడిలో కూర్చున్న లక్ష్మికి వెనుకగా పోనిచ్చి పట్టుకుని– ఇంకా మిగిలిన ఆ నాల్గవచేతినే వరద అభయహస్తాలు రెండూ కలిపినదానిగా చూపే నృసింహ! నా చేతిని పట్టుకో!' అని ఈ శ్లోకానికి అర్థం.

సంన్యాసి తన తపశ్శక్తిని అలా ఆత్మరక్షణ కోసం ఉపయోగించుకోవచ్చుననేది మార్గ దర్శకం.

### హనుమంతుణ్ణి చూశాను

ఆదిశంకరులావరు హనమత్పంచరత్న స్తోత్రాన్ని లోకానికందించారు. ఆ స్తోత్రంలో ఒకటి–

**'వానర నికరాధ్యక్షం దానవకుల**
**కుముద రవికర సదృక్షమ్**
**దీన జనావాన దీక్షం పవనతపః**
**పాకపుంజ మద్రాక్షమ్ ॥**

కోతుల సమూహానికి అధ్యక్షుడూ, రాక్షసజాతి అనే కలువలని ముకుళింపజేసే సూర్యునివంటివాడూ, దీనులను రక్షించడమే తన ధ్యేయంగా కలిగినవాడూ అయిన వాయుదేవుని తపశ్శక్తికి సాక్ష్యంగా నిలిచిన ఆంజనేయుణ్ణి దర్శించాను అనేది పై శ్లోకభావం.

ఎంతటి గొప్పవారు శంకరాచార్యులు!

సంన్యాసి అయినవారు– ప్రజలూ, వారి బాధలూ విని వారికి సలహాలు, సూచనలు ఇచ్చే ఓ కేంద్రానికి అధిపతిగా కాకుండా, రాజ సామ్రాజ్యంలా తన ఆశ్రమాన్ని విస్తీర్ణపరచుకోడానికి శ్రమించే వ్యక్తిగా కాకుండా నిత్యం తపస్సు చేసుకుంటూ ప్రజతో ఎంత దూరంలో వుండాలో అంత దూరంలోనే వుంటూ భగవంతుణ్ణి ఆ శంకరువారి లాగా దర్శించగల స్థాయిలో ఉండాలనేది ఇక్కడ మార్గదర్శకంగా తీసుకోవలసిన విషయం.

ఆ విధంగా భగవంతుని దర్శనాన్ని చేయగల శక్తితో వారున్నపుడు మాత్రమే మనకి మార్గ దర్శకులూ బాధా నివారకులూ కాగలరన్నమాట.


లేనిపక్షంలో సంన్యాసులు బాధాకారకులే అవుతారనేది ఇక్కడ గ్రహించాల్సిన విషయం.

–డా॥ మైలవరపు శ్రీనివాసరావు

# శ్రీ శృంగేరీ శారదాపీఠ శంకరాచార్యులు

# శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థస్వామి

## 66వ వార్షిక వర్థంతి ఉత్సవాలు ఏప్రిల్‌లో బ్రహ్మాండంగా జరిగాయి



**వందే శ్రీభారతీ తీర్థ సన్నిధానాహ్వయం గురుమ్।**
**శృంగాద్రీ రాజమానం తం భారత్యపరవిగ్రహమ్॥**

**శ్రీ** ఖర నామ సంవత్సర చైత్ర శుద్ధ షష్టి బుధవారము అనగా 11,4,1951వ తేదీ రాత్రి మృగశీర్షా నక్షత్రయుక్త ధనుర్లగ్నమున బ్రహ్మశ్రీ తంగిరాల వెంకటేశ్వరావధాని, మ॥॥స॥ లక్ష్మమ్మగారలకు పుత్ర జననమైంది. పురుష సంతానం కొఱకు అనేక వ్రతములు, శ్రీరామ నవరాత్రులను కావించుటచే కలిగిన ఆ బాలునకు 'సీతారామాంజనేయులు' అని నామకరణమొనర్చిరి. ఆ బాలుని చేష్టలన్నియు అసాధారణములై యుండెను. అడుగులు వేయుట కూడా రానివేళ, దేవతార్చన జరుగుచోట, శివనామోచ్చారణ చేయుట జరిగినది. అప్పట్లో తండ్రిగారు బాలునకు సంవత్సరము నిండిన సమయంలో గుంటూరు మండలంలోని నరసరావుపేట చేరారు. సీతారామాంజనేయులుకు అయిదవ ఏట అక్షరాభ్యాసం చేశారు. అప్పట్లో బ్రహ్మశ్రీ ప్రతాపగిరి శివరామశాస్త్రిగారు అనెడు గొప్ప సంస్కృత భాషా ప్రచార శీలురు, సంస్కృత విద్వాంసులు నరసరావుపేటలోఉండెడివారు. వారి వద్ద సంస్కృత విద్యాభ్యాసము ప్రారంభించి, అత్యల్ప సమయంలోనే సంస్కృత పాండిత్యమును గడించారు. శాస్త్రిగారి వద్ద తొమ్మిదవ ఏడు వచ్చువరకే, కావ్యనాటకాలంకారాదులను పూర్తి చేయడమే కాక వ్యాకరణమున కూడా అవసరమైన జ్ఞానమును సంపాదించారు.

సీతారామాంజనేయులు వారు తొమ్మిది సంవత్సరముల వయసులోనే అమరావతిలో అష్టోత్తర శత భాగవత సప్తాహం జరిగినపుడు సీతారామాంజనేయులు తండ్రిగారివెంట ఆ కార్యక్రమమునకు వెళ్లారు. ఈ పిల్లవాడు సంస్కృత భాషలో ధారాళముగా మాట్లాడగలడని విన్న పండితులలో ఒకరు 'కాపూర్వః' అని ఛలోక్తిగా అడిగినపుడు 'నరసరాట్ పూర్వః' అని వెంటనే సమాధానము చెప్పిరట. మూడు అక్షరములు కల ప్రశ్న వాక్యము. ముందీ వాక్యమును అర్థము చేసుకోవడమేకష్టం. కా+పూ+వః అను వాక్యమునకు మీయూరేది అని అర్థము. పైవాక్యము పదవిభాగము చేసికొని ప్రశ్నార్థమును గ్రహించి సంస్కృతభాషలో వెంటనే బాలబ్రహ్మచారి అసామాన్యమైన ప్రతిభ ఆ విధంగా ప్రకటింపబడెను. అంతేకాక తప్పటడుగులు వేయడం కూడా రానివేళ శివనామము నోట వచ్చెనట.

మాతృభాష అయిన ఆంధ్రము కంటె సంస్కృతమునందే ధారాళముగ ప్రసంగించగల శక్తి అలవడినది. పిన్న వయసులోనే ఆశువుగ సంస్కృత శ్లోకములు అసంఖ్యాకంగా ఆయన నోట వెలువడేవి. ఆటలలో పాటలలో సల్లాపములలో, సరసములలో సంవాదములలో లేఖలలో అవలీలగా జాలువారెడివి. ఏది కనిపించినా, అది ఇది అని ఆలోచించక మిత్రునిపై తటస్థునిపై, సమస్త వస్తువులపై ఎప్పుడూ ఏరుమీద, ఊరుమీద ఛందోబద్ధంగా అనాలోచితంగా అతిశయోక్త్యాద్యలంకార గర్భితములై పదములు ప్రవాహంగా వచ్చి, పడుతూ ఉండేవి. 1960-62 ప్రాంతంలోనే 'తేలుల్ దేరి తటద్వయమెర్మయ మృద్వీక ప్రవాహంబుగా ఉన్నదని కీ.శే. విశ్వనాథ సత్యనారాయణ, తల్లావఝుల శివశంకరశాస్త్రి వంటి ఉద్దండ పండితులు ప్రశంసించారు.

10వ తరగతి ఉత్తీర్ణులయిన తరువాత పై తరగతిలో చేర్పించవలెనని తండ్రిగారు ప్రయత్నం చేయుచున్నప్పుడు, ప్రబల వైరాగ్యము ఉత్పన్నమగుటచే ఏమాత్రము ఆలస్యం చేయక, శిప్రానదీ తీరంలోని ఉజ్జయిని పట్టణంలో చాతుర్మాస్య దీక్షా సమాయత్తులగుచున్న శ్రీ శృంగేరీ జగద్గురువులు అభినవ విద్యాతీర్థ మహాస్వామివారి సన్నిధికి వెళ్లడం జరిగింది.

నదీస్నానం చేసి వసతి గృహమునకు ఏతెంచుచున్న జగద్గురువుల దర్శనం ప్రథమంగా జరిగింది. ఈ బ్రహ్మచారి అక్కడ శ్రీవారిని చూసి వెంటనే సాష్టాంగ ప్రణామము చేయగా, శ్రీవారు ఎవరవు నీవు అని అడుగగా, సరళ సుందరమైన సంస్కృత పదములతో 'తానొక ఆర్తుడనని, ఆంధ్రప్రదేశ్‌స్థ నరసరాట్‌పట్నం నుంచి వచ్చిన బ్రహ్మచారిననీ, శ్రీచరణుల వద్ద శాస్త్ర భిక్షార్థియై తాను అక్కడకు చేరినట్లు వినమ్రంగా విన్నవించుకొన్నారు. సహజ వాత్సల్య సముద్రులయిన జగద్గురువులు బ్రహ్మచారి యొక్క అపురూపమైన ప్రతిభాపాట వములకు సంతసించి, అభయ పూర్వకముగా ఆ మరునాటి నుండియే శాస్త్ర అధ్యయనము ప్రారంభించారు. అప్పటి నుండి నిరంతర గురు శుశ్రూషలో సేవాతత్పరతలో నిమగ్నమైనారు. ఎనిమిది సంవత్సరాలలోనే పూర్వోత్తర మీమాంసలు, న్యాయశాస్త్రము, సూర్యసిద్ధాంతము మొదలగు వాటిని పూర్తిచేసి అప్రమేయ వైదుష్యము నొందియున్నారు. అపుడే వినాయక చతుర్థి సందర్భంగా జరిపెడి వాక్యార్థ సభలలో శాస్త్రార్థము గావించి అపారమైన తమ ప్రతిభను ప్రదర్శించేవారు.

*Compliments from*
**Sri Krishna Bhat**
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

అలాగే మహాసన్నిధానం వారు శిష్యస్వీకారం చేసిన అనంతరం సభలో శ్రీసన్నిధానం వారు ఉపన్యసించవలసి వచ్చింది. సన్నిధానంవారి మాతృభాష కన్నడం కాకపోవడంతో భక్తులందరు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తూ ఉన్న సందర్భంలో, సన్నిధానంవారు గురువులకు పాదాభివందనం గావించి,ఆశీస్సులందుకొని, సంక్షిప్త ప్రార్థనతో ప్రారంభించి, కన్నడభాషలో నిర్దుష్టంగా, అనర్గళమైన పదజాలంతో స్పష్టమైన భావం వ్యక్తీకరించే విధంగా ప్రవాహంలాగ సంభాషణం గావించారు. ఆ సభలో ఉన్నత న్యాయస్థానాధీశులు, న్యాయమూర్తులు, రాజకీయప్రముఖులు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు మరియు భక్తాగ్రణ్యులు అసంఖ్యాకంగా ఉన్నారు. సంభాషణను విన్న ఆస్తికులు మంత్రముగ్ధులయినారు.

మరొక సందర్భంలో ఒక భక్తుడు గురువులును స్తుతిస్తూ తాము తమిళభాషలో పద్యమును వ్రాసి, తమిళభాషను గురువులు చదవలేరనే భావనతో తానే చదివి వినిపించాలని మనసులో అనుకుంటూ ఉండగా గురువులు **(తరువాయి 7వ పేజీలో)**

**(6వ పేజీ తరువాయి)** అతని మనోభావం తెలిసికొని ఆ కాగితమును తాము తీసుకుని, చక్కగా మధుర స్వరంతో శ్రావ్యంగా చదవడమే గాక దానిలోని అంశాలనుకూడా సరిదిద్దగా ఆ భక్తుడు తన అజ్ఞతకు సిగ్గుపడి, వినమ్రంగా నమస్కరించారు. అలాగే శిష్య స్వీకారానంతరం రెండు మాసములకే జగద్గురువులు ఉభయులు రామేశ్వరయాత్రకు బయలుదేరిన సందర్భంలో, మార్గమధ్యంలో గోపిచెట్టి పాళ్యం గ్రామంలో భక్తులకు దర్శనమును అనుగ్రహించినపుడు ఆ గ్రామస్థుల విన్నపంపై తమిళభాషలో శ్రీసన్నిధానం ప్రసంగించవలసి వచ్చింది. మహాసన్నిధానం, వారి ఆదేశానుసారము శ్రీసన్నిధానము వారు, వ్యాకరణ దోషములు లేకుండా, సరళ భాషలో, సర్వజన సంవేద్యమైన పదజాలంతో చక్కగా ప్రసంగించారు. ఇక ఆ గ్రామస్థుల ఆనందము వర్ణనాతీతము. తమ భాషలో ప్రసంగించిన శ్రీసన్నిధానంపై వారి భక్తి సమధికమైంది.

అలాగే శ్రీమహాసన్నిధానంవారిని సేవించుచూ శ్రీసన్నిధానంవారు ఉత్తరదేశ (పర్యటన) విజయయాత్రలో హిందీ భాషలోనే ప్రసంగించేవారు. కలకత్తా, ముంబై, కాశీ, అలహాబాదు మున్నగు ప్రదేశములలో శ్రీసన్నిధానం హిందీ భాషలో గావించిన అనుగ్రహభాషణములు పండిత పామరలోకములనలరించినవి. సొగసుగా, జిగి-బిగి కలిగి ఉత్సాహభరితమైన ఆ భాషణములు ముగ్ధులను గావించాయి. శిష్ట వ్యావహారికమైన, సంస్కృత జన్యమైన పద జాలంతో కొనసాగిన ఆ ప్రసంగములు హిమవత్ సానువులపై గంగాజలం వలె అలవోకగా జాలువారాయి. వారణాసి వాస్తవ్యులు అయిన చల్లావారిని, శ్రీరాజగోపాలశర్మగారు, అన్నపూర్ణ ఆలయ నిర్వాహక స్వాములను సహితం ఈ ప్రసంగాలు విస్మపోయేటట్లు చేశాయి. మధ్యప్రదేశంలోని పరమహంస గంగాశ్రమములోని శ్రీరాజరాజేశ్వరీదేవి ఆలయంలో ప్రతిష్ఠా మహోత్సవంలో గావించిన శ్రీవారి అనుగ్రహభాషణం లక్షలాది భక్తజనమును, ఆటవిక, ఆదివాసుల హృదయాలను సహితం ఆకట్టుకున్నది.

శ్రీసన్నిధానంవారికి మళయాళ భాషలో కూడా సమగ్ర పాండిత్యం కలదని అభిజ్ఞుల ద్వారా వినడం జరిగింది.

జగద్గురువులకు ఆంగ్ల భాషలో కూడా మంచిప్రావీణ్యం ఉన్నప్పటికీ ఏ సభలోనూ విదేశీ భాషలో భాషణం చేయరు. భక్తులెవరైనా తమకు ఇంగ్లీషులో ఉత్తరం రాస్తే అభిమానంతో వాటిని చదివి, వాటికి ప్రత్యుత్తరం వ్రాయిస్తారు. ఒక భక్తుడు ఒకసారి ఆంగ్లంలో తాను వ్రాసిన నివేదనను గురువులకు నివేదించుకునే ముందు తన భాషలో ఏమైనా తప్పులున్నాయేమోనని పరిశీలించి, వాటిని దిద్దుకొని గురువులకు సమర్పింపగా స్వామివారు ఆ ఉత్తరములోని పదక్రమమును, వ్యాకరణ దోషములను సరిచేయడం జరిగింది. వారి సునిశిత పరిశీలనకు తనపై గల వాత్సల్యమునకు ఆ భక్తుడు అబ్బురపడినాడు.

శ్రీవారి అనుగ్రహణ భాషణములందొక ప్రత్యేకత ఉంటుంది. ఏ భాషలో భాషణములు కొనసాగినను ఆ ప్రాంతపు నుడికారంతో సౌందర్యగర్భితమై, సరళ సుందర పదజాలంతో, నిసర్గ మోహనముగ, శ్రోతృ జన సంవేద్యమై, ప్రసన్న మధురంగా ఉంటుందని ముక్తకంఠంతో అనుభవజ్ఞుల అభిప్రాయం.

అలాగే ప్రతి సంవత్సరం శాస్త్ర సంవర్ధినీ సభ, శాస్త్రపోషక సభ,సపరికర అద్వైత వేదాంత సభ మొదలగునవి శ్రీ శృంగేరి శారదాపీఠము నిర్వహించు శాస్త్ర సభలు. ఇవిగాక శతాధిక సంవత్సరముల నుండి గణపతి నవరాత్రములలో నిర్వహింపబడుచున్న శ్రీ మహా గణపతి వాక్యార్థ విద్వన్మహాసభ చాలా విశిష్టమైనది. దేశమునందలి సుప్రసిద్ధులగు వరిష్ఠ పండితులు సహితము శ్రీశారదా పీఠం ఆహ్వానమందినవెంటనే, ఆత్మానంధన్యంమన్యులై అందు పాల్గొనుచుందురు. సభాధ్యక్ష స్థానమునందుండి శ్రీవారు పండితులు గావించు శాస్త్రార్థములను సూక్ష్మదృష్టితో పరిశీలించుచు, పండితులకు వారు చేయు సూచనలు, సవరణలు, పరిష్కారములు సమస్త పండిత వర్గమునకు అధికమైన ఆనందమునొసగును. శ్రీవారి శాస్త్ర పాండిత్యము, వారి ధారణా పటిమ, ప్రతిపాదనా కౌశల్యము అప్రతిమమైనది. వారి భాషణములోని స్పష్టత, సమగ్రత, ప్రామాణికత ఆదర్శనీయము. "పదవాక్య ప్రమాణ పారావార పారీణ సర్వతంత్ర స్వతంత్ర, వాఖ్యాన సింహాసనాధీశ్వర" అను బిరుదావళి శ్రీభారతీతీర్థ స్వాములకు అన్వర్థము.

శ్రీవారు, సరళసుందరమైన, అన్వయక్లేశం లేని పదావళితో అనేక కృతులను రచించారు. శ్రీగణేశగీతమ్, సుబ్రహ్మణ్య, శ్రీశారదా, శ్రీశంకరాచార్య, శ్రీరామ, విష్ణాదుల స్తోత్రములు భక్తజన సుపరిచితములే! శ్రీవారి విభిన్న భాషలలోని అనుగ్రహభాషణములను శ్రవణం చేసి వాటిని మననం చేసుకొన్నచో ఐహికమైన ఫలమగు భాషాపరిజ్ఞానము, నీతిమంతమైన జీవనవిధానము, అలవడి ఉత్తరత్ర ఆముష్మికఫలమునందుకొను అర్హత కలుగును. కనుక జగద్గురువుల శిష్యులమగు అందరము ఆ దిశలో పయనించి శ్రేయస్సులనొందెదము గాక. ●

# అభినందనం

**శ్రీయుత గౌ॥ గోటేటి శ్రీరామారావు గార్కి**

సంపాదకులు, ప్రముఖాంధ్ర,

**ప్రపంచ తెలుగుల మానసపత్రిక, చెన్నై**

ఆర్యా!

మీ యొక్క 84వ జన్మదినం సందర్భంగా మా సంస్థ పదాధికారులు మరియు సోలాపూర్ పట్టణ 5 లక్షల తెలుగు ప్రజల తరపున శుభాకాంక్షలు.

మీరు నిండు నూరేళ్లు జీవించాలని ఆ ఏడుకొండల స్వామివారిని వేడు కుంటున్నాము.

మరియు మేము పంపించిన ఉత్తరము మార్చి నెల ప్రముఖాంధ్ర సంచికలో ప్రచురించినందులకు ధన్యవాదములు.

ఇట్లు, కార్యదర్శి

**జి. తిప్పణ్ణ,**

గ్రంథపాలకులు

సౌ॥ రాథయర్జల్,

తెలుగు భాష అభివృద్ధి మండలి, షోలాపూర్, (మ.రా)





# తండ్రికి తగ్గ తనయుడా? తండ్రిని మించిన తనయుడా? మండలి బుద్ధప్రసాద్ ఏమనుందు! నేనేమనుందు!

అవనిగడ్డ నుంచీ అమెరికా వరకూ తెలుగు వెలుగుకు చలువ పందిళ్ళు వేసిన మండలి వేంకట కృష్ణారావు వారసుడని చెప్పనా?

తెలుగు భాషా సాంస్కృతిక, వారసత్వ సంపదను, సృజనాత్మకతను సాహితీ సందను తరతరాలకందించే తపన కలవాడని చెప్పనా? తపస్సు చేస్తున్నవాడని చెప్పనా?

నలభై సంవత్సరాల క్రితం తండ్రి చేబట్టిన భాషాభివృద్ధి కార్యక్రమానికి జీవితం అంకితం చేస్తున్న అవనిగడ్డ మొనగాడని నొక్కి చెబుతాను.

తండ్రివలె ఆ పంచెకట్టు, తెల్లటి ముక్కూ, మోమూ, నుదురూ, కుదురూ, ముక్కూ, మోమూ, ప్రక్క క్రాపింగూ, మాటా, మాట ఒద్దికా, నడకా – అన్నీ తండ్రి ప్రతిరూపాలని చెప్పాలి.



పోలికలో తండ్రి పోలికలున్నాయ్ గానీ, కార్యక్రమాల నిర్వహణలో, దక్షతలో, నిబద్ధతలో తండ్రికి మించిన తనయునిగా కనిపిస్తున్నాడు. అవనిగడ్డ గాంధీ క్షేత్రములో తండ్రి నిర్వహించే అన్ని కార్యక్రమాలూ చేస్తూనే అధికంగా మరికొన్ని సాహితీ కార్యక్రమాలు చేస్తున్నారు. సాహితీకారులను సత్కరిస్తున్నాడు. శాసనసభ్యునిగా, నియోజిక వర్గ ప్రజలకు ప్రాయోజిక కార్యక్రమాల్ను క్రమం తప్పకుండా చేస్తూన్నాడు. విత్తరహిత సత్కారములను చేయడం లేదు.

కృష్ణా జిల్లా పత్రికా రచయితల సంఘానికి వెన్నుదన్నుగా ఉన్నారు.

శాసనసభ ఉప సభాపతి పదవీ సకల బాధ్యతలను నిర్వహిస్తూనే, తెలుగు సాహిత్యానికి అకుంఠిత సేవ చేస్తూన్న అవనిగడ్డ గాంధీ ఆశ్రమ నేతను అఖిల భారత తెలుగు సాహితీవేత్తలందరూ బుద్ధప్రసాద్ ఆయురరోగ్యైశ్వర్య సంపదలతో వర్ధిల్లాలని ముక్తకంఠంతో దీవించాలి.

షష్ట్యాబ్ది వయసు సోయగానిలో ముదిమతనం పొడసూపలేదేమో! అజాత శత్రుత్వం, ఆయన మంచితనం కలిసి ఇరవై ఏండ్లవానిగా చేస్తున్నాయ్! సంపూర్ణ ఆయుష్షు 120 సంవత్సరముల జీవన సౌభాగ్యమందుతూ, నిత్య యవ్వనోత్సాహంతో వర్ధిల్లాలని మా ఏలిక ఏడుకొండలవాణ్ణి ప్రార్థిస్తున్నాను.

– గోటేటి శ్రీరామారావు

# ముక్త్యాల కోటలోపుట్టిన ఆణిముత్యం చెన్నయ్ కె.సి.పి. కోటలో చెలువొందిన మహిళా రత్నం

# వి.ఎల్. ఇందిరాదత్



ఆమె జమీందారుల బిడ్డ. మరో జమీందారు కోడలు. కానీ జమీందారీ భేషజం లేని మహిళారత్నం ఇందిరా (దత్) రత్నం. ఏ సంస్థ ఆధిపత్యం వహించినా, ఆ సంస్థను అగ్రశ్రేణి సంస్థగా తీర్చిదిద్దడంలో ఆమె చాతుర్యం ఉంది.

ప్రతిభా సంపన్నుడైన యు. విశ్వేశ్వ(ర్రావు)రుడు స్థాపించిన ప్రపంచ తెలుగు సమాఖ్యను ప్రముఖ తెలుగు సమాఖ్యగా తీర్చిదిద్దడమే గాకుండా ఆమె వాగ్దానం చేసిన విశాఖపట్టణంలోని తెలుగు మ్యూజియమ్‌ను పూర్తిచేసి ప్రారంభం చేసిన ఖ్యాతి ఇందిరాదత్‌గారిదేనని చెప్పడానికి గర్విస్తున్నాను. ప్రపంచ తెలుగు సమాఖ్యకు వరుసగా ఆరవసారి అధ్యక్ష బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

అలాటి మహిళారత్నం కృషిని ఆమె మాటల్లోనే తెలుసుకుందాం!

**నే**ను ముక్త్యాల కోటలో పుట్టాను. చల్లపల్లి రాజా యార్లగడ్డ రామకృష్ణప్రసాద్ (రోజులుమారాయి నిర్మాత) గారికి నేను మేనకోడలిని. అలా నాకు అమ్మ తరఫునా, నాన్న తరఫునా రెండూ జమీందారీ కుటుంబాలే. నా చదువంతా చెన్నైలోనే. క్వీన్‌మేరీస్ కాలేజీలోనే ఎమ్మే చదువుతుండగా వెలగపూడి రామకృష్ణగారు నాన్నగారితో నా పెళ్ళి గురించి ప్రస్తావించారు. అలా వాళ్లబ్బాయి వి.ఎల్. దత్‌గారితో నా పెళ్లయింది. దాంతో చదువు అర్థాంతరంగా ఆగిపోయింది. లండన్‌లో ఐసిఎస్ చదివిన రామకృష్ణగారు ఉమ్మడి మద్రాసు రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. కొంతకాలానికి ఉద్యోగానికి రాజీనామా చేసి ఉయ్యూరులో కృష్ణా కన్షెక్షనరీ ప్రాడక్ట్ (కేసీపీ) పేరుతో చాక్లెట్ల ఫ్యాక్టరీ పెట్టారు. ఆ తర్వాత మాచెర్లలో సిమెంటు ఫ్యాక్టరీ ప్రారంభించారు. అలా మొదలైన కేసీపీ పారిశ్రామిక ప్రస్థానం ఇప్పుడు శ్రీలంక, వియత్నాం తదితర విదేశాలకు కూడా విస్తరించింది. ఆ గ్రూపు సంస్థలకు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నా ఎదుగుదలలోని ప్రతి మలుపులో దత్‌గారున్నారు.

అమ్మానాన్నలు ఇద్దరూ ఎమ్మెల్యేలే! నిత్యం ప్రజల మధ్య ఉండేవారు. దీంతో నాకూ ఆ లక్షణాలొచ్చాయి. ఆరోజుల్లో ఎమ్మెల్యే అంటే ప్రజల్లో చాలా గౌరవం, నాయకులకూ ప్రజలంటే అపారమైన అభిమానం. కరువుకాటకాలతో రైతులు పడుతున్న కష్టాలు చూసి నాన్న కదిలిపోయారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కడితే వారి కష్టాలన్నీ తీరిపోతాయని భావించారు. తన సొంత ఖర్చుతో ఇంజనీర్లను, పనివాళ్ళను వెంటనేసుకుని కొండప్రాంతాలన్నీ తిరిగి సర్వే చేయించారు. అప్పటి చీఫ్ ఇంజనీర్ కెఎల్‌రావుగారు ఈ విషయంలో చాలా సహకరించారు. నాన్నగారి అలవాట్లు, జీవనవిధానం నా మీద చాలా ప్రభావం చూపాయి. ఇప్పుడు కార్మికులతో ఇంత కలుపుగోలుగా ఉంటున్నానంటే అందుకు కారణం నాన్నే!

*మహిళలు ఎందులోనూ తక్కువ కాదు. ప్రోత్సహించేవాళ్లుంటే అద్భుతాలు సాధిస్తారు. కంపెనీ బాధ్యతలు చేపట్టక ముందు నుంచి కూడా వారికి అవకాశాలు కల్పించడానికి నా వంతు ప్రయత్నం చేస్తున్నాను. 'ఏ వైఫల్యానికీ నీరుగారిపోవద్దు. ఆత్మవిశ్వాసంతో దేన్నయినా సాధించగలం. అవకాశం వచ్చినప్పుడు వెనకడుగు వేయవద్దు. దాన్నే సవాలుగా తీసుకోండి'... నేను మహిళలకు పదేపదే చెప్పే మాట ఇది. మహిళలకే కాదు, విజయబాటలో నడవాలనుకునే వారందరికీ పనికొస్తుంది. ఈ మాటే నిఘంటువులా తోడ్పడుతుంది.*

## తెలుగుసేవ

తెలుగు భాష అన్నా, సంస్కృతీ సంప్రదాయాలన్నా నాకు చాలా అభిమానం. 1992లో ప్రపంచ తెలుగు సమాఖ్య ఆవిర్భావం నుంచీ నాకు సన్నిహిత సంబంధాలున్నాయి. తెలుగువారు ప్రపంచంలో ఏ మూలకు వెళ్ళినా మూలాల్ని మరువకూడదనే ఉద్దేశంతో 'ఎన్ని భాషలైనా నేర్వండి... మాతృభాషను మాత్రము మరువకండి' (తేటగీతి ఛందస్సులో) అనే నినాదాన్ని తీసుకొచ్చాం. విశాఖపట్నంలో ఐదుకోట్ల రూపాయల వ్యయంతో ఓ హెరిటేజ్ మ్యూజియమ్ (తెలుగు సారస్వత నికేతనం) నెలకొల్పాం. చెన్నై ప్రజలు తెలుగు భాషకు దూరం కాకుండా, వారికోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఏటా తెలుగు పండుగల్ని ఘనంగా జరుపుతున్నాం. అంతరించిపోతున్న సంప్రదాయ కళలకు జీవం పోయాలన్నది నా ఆలోచన. వరంగల్ జిల్లా చేవెళ్లలో బిక్కుబిక్కుమంటూ మనుగడ సాగిస్తున్న ఓ హస్తకళా రూపాన్ని సజీవంగా నిలపడానికి మా వంతు ప్రోత్సాహమందించాం. అమెరికా, సింగపూర్, దుబాయ్.... ఇలా ఎన్నో దేశాల్లో తెలుగువారిని ఒకే వేదిక మీదికి తీసుకురాగలిగాం. 2003లో నేను అధ్యక్షురాలిని అయ్యాక దక్షిణ భారతం లోని 16 నగరాల్లో 75 తెలుగు కార్యక్రమాలు నిర్వహించాం. నా సాంస్కృతికాభిమానాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి ఈ మలుపు ఎంతో ఉపయోగపడింది.






# గాంధీగారు రాజమండ్రిలో తయారైన రత్నం పెన్ను వాడారు మేము వారి సహసంస్థ తయారు చేసిన బ్రహ్మం పెన్ను వాడాము

**తొ**లుత సిరాబుడ్డిలో కలాన్ని ముంచి వ్రాసేట్టుగా పుట్టిన కలమా! గాజుపాళీ పెన్నుగా మారావు! ఫౌంటెన్ పెన్నువయ్యావు! బాల్‌పాయింటు పెన్నుగా రాజ్యమేలావు! ఇపుడు రోలర్ బాల్‌పెన్నుగా రాణిస్తున్నావు! ఇంకా యెన్ని అవతారాలు దాల్చగలవో చెప్పతరమే! సంస్కృతి మారినట్లు నీవూ మారుతున్నావు. తొలుత రెండింటికి బంగారు పాళీ వాడేవారు. వీటి ఖరీదు అధికంగా ఉండేవి.

మద్రాసులో ఒక శ్రేష్ఠిగారు చౌకధరలో 'గామా' పెన్నులను ప్రారంభించారు. జపానువారు పోటీగా చాలా చాలా తక్కువ ధరల్లో పెన్నులను మార్కెట్లో విడుదల చేసారు. ఓసారి పెన్ను ఘోషను చదవండి.

**మీ**తో తరతరాల అనుబంధం మాది. వేదకాలం నుంచీ ఏదో ఒక రూపంలో మీ భావాలను అక్షరబద్ధం చేస్తూనే ఉన్నాను. రాజులు, మహారాణుల చేతుల్లో నెమలి ఫించంగా హొయలు ఒలకబోశాను. మహాకవులు, పండితులు చేతిలో ఘంటంగా సాహితీ సౌరభాలను వెదజల్లాను. తెల్లని కాగితంపై నా నల్లని సిరా చుక్కలు ఎందరికో జ్ఞానాన్ని పంచిపెట్టాయి. ఎందరినో నా పాళీతో 'మహాప్రస్థానం' వైపు తీసుకెళ్లాను. కత్తికన్నా కలం గొప్పది అంటూ ఏనాడో కీర్తి ప్రతిష్టలు దక్కించుకున్నాను. కలం మెదడుకు నాలకలాంటిదని కూడా నా గురించి చెప్పుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకుని గుడిపాటి వెంకటాచలం దాకా ఎందరో నా ద్వారా తమ మనోభావాలను మిత్రులు, సన్నిహితులతో పంచుకున్నారు. మనుషుల మధ్య బంధాలకు కలం ఒక వారధిగా పనిచేసిన విషయం నేటి తరానికి తెలియదు. ఒకనాడు ఠీవీగా, రాజసంతో దర్జా జీవితాన్ని గడిపిన నేను రీఫిల్ అనే ప్లాస్టిక్ గొట్టంలో మూన్నాళ్ల ముచ్చటలా బతుకుతున్నాను. నేటి తరానికి నా అవసరం లేదు. సంతకాలకు తప్ప ఎందుకూ పనికిరాదు. నేటి యువతరానికి ల్యాప్‌టాప్, ఇంటర్‌నెట్‌తోడిదే లోకం! నా అవసరం చిన్నారులకు తప్ప ఎవరికీ కనపడదం లేదు. భవిష్యత్ తరంపైనే నా ఆశలన్నీ! వారైనా నాతో చెలిమి చేస్తారని, అనుబంధాన్ని పంచుకుంటారని ఆశిస్తున్నాను. మీతో నా బంధం ఏనాటిదో మీకు గుర్తు చేయడం నా బాధ్యత. సావధానంగా విని నా బాధను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి.

అప్పటివాళ్లు నన్ను ఎంత అపురూపంగా చూసుకునేవారో ఇప్పటికీ తలచుకుంటే మనసు ఆనందంతో ఉప్పొంగుతుంది. ఉదయం నిద్రలేవగానే నన్ను పలకరించేవాళ్లకు తెల్లవారదు. ఇప్పట్లా మాది బాల్‌పెన్ వంశం కాదు. చక్కగా బంగారు రంగులో తళతళలాడుతూ పాళీతో రాసే ఇంకు పెన్ను వంశం. నా పాళీని చూస్తే ఎవరికైనా ముచ్చటేయాల్సిందే. పదునైన బ్లేడు తీసుకుని పాళీ మధ్యలో సన్నగా ఉండే గీతలో దాన్ని గుచ్చి సున్నితంగా గీసేవారు. ఏదైనా అడ్డంపడి ఉంటే పోతుందని అలా చేసేవారు. పందెం కోడిని ఎలా సిద్ధం చేస్తారో అలా ప్రతిరోజూ తయారుచేసేవారు నన్ను. బుడ్డీలోని సిరాను ఫిల్లర్‌లోకి తీసుకుని జాగ్రత్తగా సిరా పోసేవారు. శుభ్రంగా తుడిచి నన్ను చొక్కా జేబులో దూర్చి ఉద్యోగానికి వెళ్ళేవారు. నేను జేబులో లేకపోతే అందరికీ వెలితిగా ఉండేది. చివరిదాకా, నన్ను తమలో ఒకడిగానే చూసుకునేవారు. అప్పటివారి జ్ఞాపకంగా నన్ను కొందరు దాచుకున్నారు కానీ ఈ కాలంలో నా అవసరం లేదు.

## రూపాలు మార్చుకున్నా

మారుతున్న కాలాన్ని బట్టి నేనూ మారాల్సి వచ్చింది. ఇంకు పెన్నుని కాస్తా బాల్‌పాయింట్‌గా మారిపోయాను. అక్కడి నుంచే నాకు కష్టకాలం మొదలైంది. బాల్‌పాయింట్ నుంచి జాటర్, జెల్, రోలర్, గ్లిట్టర్ ఇలా ఎన్నో అవతారాలు ఎత్తాను. ఎక్కడా ఎవ్వరూ నన్ను కుదురుగా ఉండనివ్వరు. కూరలో కరివేపాకులా నా అవసరం తీరగానే నన్ను విసిరి బయటపడే ధోరణి ఈ తరంతోనే మొదలైంది. సున్నితమైన మనసులు కూడా బండలా మారిపోతున్నాయి. ఆత్మీయులు ప్రేమగా ఇచ్చిన కానుకలను కూడా మూలనపడేయడం నేటి తరం లక్షణం. ప్రతి ఇంట్లో కుప్పలు తెప్పలుగా ఎన్ని పెన్నులు పడి ఉంటాయో అందరికీ తెలిసిన విషయమే. వీటిలో మనం ఎన్నిటిని వాడుకుంటున్నామో, ఏది ఎవరిచ్చిన బహుమతో ఎవరైనా చెప్పగలరా? ఖరీదైన పార్కర్ పెన్నులకే ఆ గతి పడితే 'యూజ్ అండ్‌త్రో'గ్నా నా పరిస్థితి ఎంత దీనంగా ఉందో ఎవరికి చెప్పుకోను? అయినా మీకు మీ పాత రోజులు గుర్తుకు రావడం లేదు. మీరు కాలేజీకి వెళ్లే రోజుల్లో ప్రేమలేఖలు ఎన్ని రాసి ఉంటారు? పెళ్లయిన కొత్తలో భార్యాభర్తల మధ్య విరహవేదనను వర్ణించడం ఎవరికి సాధ్యం? శుభాలకు అశుభాలకు అన్నిటికీ నేనే సాక్షీభూతం! ఇప్పటిలా ఫోన్‌సందేశాలు అప్పట్లో ఎక్కడున్నాయి?

## కంప్యూటర్‌తో కష్టాలు

ఇక ఈ మధ్య కంప్యూటర్లొచ్చి నన్ను పూర్తిగా పనికిరానివాడిగా మార్చేశాయి. అంతకుముందు చక్కగా నన్ను జేబులో పెట్టుకుని తిరిగేవాళ్లు కూడా ఈ మధ్య అది కూడా మానేశారు. ఆఫీసులో నా అవసరం ఎవరికీ లేకుండా పోయింది. రాతపని పోయి కంప్యూటర్‌లోనే పనిచేసుకుంటున్నారు. ఇప్పటి యువతరానికి పెన్ను అవసరం క్లాసులో తప్ప ఎక్కడా ఉండడం లేదు. ఈ మధ్య లాప్‌టాప్‌లు, ఐపాడ్‌లు, సెల్‌ఫోన్‌లు వచ్చినప్పటి నుండి పెన్ను అవసరంలేదు. పెన్ను లేకపోతే ఒక్కోసారి ఎన్ని ఇబ్బందులు ఎదురవుతాయో అందరికీ తెలిసిన సంగతే! బ్యాంకుకో, ఆఫీసుకో వెళ్లినప్పుడు సంతకం పెట్టడానికి పెన్ను లేకపోతే నానా అవస్థలు పడాల్సి వస్తుంది. పెన్ను కోసం పక్కవాళ్లని అడిగితే వాళ్ళు చిరాకు మొహం పెడతారు. మనమెక్కడ తిరిగి ఇవ్వకుండా వెళ్ళిపోతామేమోనని క్యాపు తీసుకుని పెన్ను ఇస్తారు! రైల్వే రిజర్వేషన్ కౌంటర్ దగ్గర ఇతర చోట్ల పెన్ను లేకపోతే ఎన్ని ఇబ్బందులో చెప్పలేం! అందరికీ అనుభవంలోకి వచ్చే ఉంటుంది. పెన్ను అవసరం ఉంటుందని మనకు తెలుసు. కాని దాన్ని మన దగ్గర ఉంచుకోకుండా అలక్ష్యం చేస్తాం. ఒకరిని అడిగి లేదని అనిపించుకునే కన్నా మన దగ్గరే పెన్ను ఉంచుకుంటే మన కెంత గౌరవం.

## పిల్లలతోనే నా నేస్తం

ప్రస్తుతం చదువుకునే బడి పిల్లలకు మాత్రమే పెన్ను అవసరం ఎక్కువగా ఉంది. పిల్లలకు పెన్నులంటే ఎంతో ప్రీతి. కొత్త మోడల్ పెన్ను ఏది వచ్చినా కొనందేవారు ఊరుకోరు. అయితే ఇక్కడ కూడా కొత్త టెక్నాలజీ వచ్చి పిల్లలు నన్ను దూరం చేస్తారేమోనని పెన్ను భయపడుతూ ఉంది. పెన్ను అవసరం లేని చదువులు, కాగితంపై వ్రాసే రోజులూ మారిపోతాయేమో!

# మామిడి తోరణం కట్టనిదే శుభకార్యం జరుగదు మామిడి పిందె లేకుండా ఉగాది పచ్చడి ఉండదు!

"వేములు పూసె వేములు కాసె ఓ మామిడి
వేములపళ్ళు పక్షులు మేసె ఓ మామిడి
పక్షులన్నీ గంగ చేరె ఓ మామిడి
గంగా చేరి నీరు తాగె ఓ మామిడి
నీరు తాగి ఒడ్డుకెక్కె ఓ మామిడి
ఒడ్డునున్న బొడ్డుమల్లె ఓ మామిడి
కోసిపెట్ట ఎవరు లేరు ఓ మామిడి
కోసిపెట్ట కృష్ణమూరితి ఓ మామిడి
పంచిపెట్ట ఎవరు లేరు ఓ మామిడి
పంచి పెట్టు శ్రీలక్ష్మి ఓ మామిడి"



పెరట్లో మామిడి పిందె పడగానే ఇంట్లో పసిబిడ్డ పుట్టినంత సంబరపడతారు తెలుగువాళ్ళు! ఇంట మామిడి పండిందంటే పండంటి బాబు పుట్టాడని!

మామిడి తెలుగువారి అమృతఫలం

ఇంటికి పచ్చదనాన్ని ఇచ్చేవి మామిడి తోరణాలే! సౌభాగ్యానికి గుర్తుగా మామిడాకులను భావించటం దాని ప్రాచీనతకు గుర్తు. మామిడి కోసం ఉగాది ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తాం. మామిడి ఆకులనే ముంగిట ముగ్గుల్లో మన ఆడపడచులు చిత్రిస్తుంటారు.

మామిడి ప్రస్తావన ఋగ్వేద కాలంలోనూ కనిపిస్తుంది. ప్రజాపతి స్వయంగా మామిడి వృక్షంగా అవతరించాడని మన నమ్మకం. ఒకసారి బుద్ధుడు మామిడి పండు తిని, దాని టెంకని అక్కడ పాతి, చేతులు కడుక్కొనాడంట. వెంటనే అక్కడ తెల్లని మామిడి మొక్క పూలూ, కాయలతో మొలకెత్తిందట. అప్పటి నుంచీ బౌద్ధులు, మామిడి పవిత్ర వృక్షంగా భావిస్తారనీ ఐతిహాసం. భార్హుత్ శిల్పాలలో ఈ ఘట్టాన్ని వివరించే దృశ్యాలున్నాయి. జైన దేవత అంబ, మామిడి చెట్టు క్రింద కూర్చుని ఉన్నట్లు వర్ణన కనిపిస్తుంది. మన్మథుడికి మామిడి మొక్కకీ అవినాభావ సంబంధం ఉందట.

మావి చిగురు తిని, కోయిల కూస్తుందని తెలుగువారి నమ్మకం. వైద్యపరంగా మామిడి చిగుళ్ళను తింటే గొంతు శ్రావ్యం అవుతుందని ఆయుర్వేద వైద్యశాస్త్రం చెప్తుంది. మామిడి కాయకూ, ఉగాదికి ఒకేసారి స్వాగతం పలుకుతారు తెలుగువాళ్ళు. ఉగాది పచ్చడి కోసం ఆత్రంగా ఎదురుచూస్తారు. తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు ఈ ఆరు రుచులూ కలబోసిన ఉగాది పచ్చడి వలన ఆరోగ్యం మనకు దక్కాలంటే, ఉగాదితో ప్రారంభించి శ్రీరామనవమిదాకా రోజూ ఈ పచ్చడి తినాలనీ, అలా తింటే వేసవి వేడికి శరీరం తట్టుకోగలుగుతుందనీ శాస్త్ర విదితం.

మొఘల్ చక్రవర్తులు, సుల్తానులూ మామిడిని బాగా ఇష్టపడేవాళ్లు. కానీ, తమ ఇష్టం కొద్దీ, మామిడి పళ్ళను రాజవంశీకులే తినాలని నియమం కూడా పెట్టారట. ప్రజల్లో ఇది తీవ్ర ఆగ్రహావేశాలకు దారితీయటంతో మామిడిమొక్కను జాతీయం చేసి అందరికీ దాని ఫలం అందుకోవాలని ఆనాడు శాసించారు.


# ఆత్రేయ, పెండ్యాల, శాంతకుమారి, పి.పుల్లయ్యగారలూ ఎన్నాళ్లని నా కన్నుల కాయగ ఎదురు చూతు మీ పాటకై

పి. పుల్లయ్య రెండు పర్యాయములు దర్శకత్వం వహించిన 'శ్రీవేంకటేశ్వరమహత్యం' చిత్రం తీసి ఎంత పుణ్యం కట్టుకున్నాడో! ఎన్నాళ్లకు ఈ పాటతీపిదనం పోదని గ్రహించారు. ఈ చిత్రాన్ని నిర్మించగలవారు, దర్శకులూ ఉంటే వారికి సాష్టాంగ నమస్కారం చేస్తాను. – గోటేటి

పద్మశ్రీవారి 'శ్రీవేంకటేశ్వర మహత్యం' (1960) చిత్రంలో వి.శాంతకుమారి పాడిన ఈ పాట సంగీత సాహిత్యాల సమతుల్య సమ్మేళనం అని చెప్పారు. దర్శకులు పి. పుల్లయ్య ఆ పురాణగాథను వన్నె తరగని ప్రణయగాథగా తీర్చిదిద్దారు. పాటలన్నీ పెండ్యాల ప్రతిభతో రసప్లావితం అయ్యాయి. శాంతకుమారి కంఠం వాత్సల్యానికి నెలవు. ఆ గాత్రానికి శ్రోతలు మంచులా కరిగిపోయారు. 'కృష్ణప్రేమ', 'ధర్మపత్ని' 'గుణసుందరి' 'షావుకారు' వంటి చిత్రాల్లో తన పాత్రలకు తానే పాడారు. అయితే ఆ తర్వాత ఆమె ధరించిన పాత్రలకు పాటలు లేకుండా పోయాయి. దాంతో శాంతకుమారి కంఠాన్ని ఇటు ప్రేక్షకులు, అటు ఆమె భర్త (పి.పుల్లయ్య) కూడా మరచిపోయారు. ఆ మర్చిపోవడం ఎక్కడి దాకా అంటే ఈ చిత్రంలో ఆమె ధరించిన వకుళమాత పాత్రకు ఆనాటి ప్రసిద్ధ గాయని చేత పాడించడానికి సిద్ధపడేంత వరకూ! శ్రోతల అదృష్టం బాగుండి ఆ గాయని పాడటానికి ఒప్పుకోలేదనుకోండి! సెట్ సిద్ధమైపోవడంతో 'ఏదో నువ్వే పాడి పూర్తి చెయ్యి' అన్నారట పుల్లయ్య. వ్యవధి తక్కువైనా ఈ చిత్రంలో రెండు పాటలను, ఒక పద్యాన్ని అతి మధురంగా ఆలపించారామె. 1939లో వచ్చిన 'శ్రీవేంకటేశ్వర మహత్యం' చిత్రంలో నాయిక (పద్మావతి)గా వేసిన శాంతకుమారి 1960లో వచ్చిన 'శ్రీవేంకటేశ్వర మహత్యం'లో వకుళతల్లిగా పాత్రవేయడం విశేషం. ఈ రెండు చిత్రాలకు దర్శక నిర్మాత పి. పుల్లయ్యే. ఈ పాటలో ఊర్వశి శారద, గీతాంజలి ఆశ్రమవాసినులుగా కనిపిస్తారు.







**ఎన్నాళ్లని నా కన్నులు కాయగ ఎదురు చూతురా గోపాలా**
**ఎంత పిలిచినా ఎంత వేడినా ఈ నాటికి దయ రాదేలా**
**వీనుల విందుగా వేణుగానమూ వినితరింపగ వేచితిరా**
**వేచి వేచి వెన్నముద్దవలె కరిగిపోయెరా నా బ్రతుకూ..**

పాత్రల మనోభావాలను, చిత్ర కథాంశాన్ని ఔపోసన పట్టి తన అపార సాహిత్య అనుభవంతో వాటిని రంగరించి ఈ పాటలో పొందుపరిచారు ఆత్రేయ. 'పీలు' రాగంలో రసభరితంగా స్వరపరచి, శాంతకుమారి గాత్రంలో వెన్నమీగడల మాధుర్యాన్ని వెలికితీశారు పెండ్యాల. వెండితెరపై శాంతకుమారి ఎన్ని పాటలు పాడినా ఆమె పేరు చెప్పగానే గుర్తుకొచ్చే పాట.

(డా.కంపెల్ల రవిచంద్రన్‌కు కృతజ్ఞతలు)

# చెన్నయ్‌లో తెలుగువారి త్యాగ సభ

# త్యాగరాజు గాన సభ




**గో**టేటి ప్రారంభించిన బాలరాజ్యం, మధురవాణి పత్రికల ప్రారంభోత్సవం ఇక్కడే జరిగింది. సుప్రసిద్ధిగొన్న భామాకృష్ణ నృత్య అరంగేటంౖ ఇక్కడే జరిగింది.

వాణీమహల్ లేదా శ్రీ త్యాగబ్రహ్మ గానసభ...

ఈ సభ నిర్మాణంలో తెరవెనుక తెలుగువారు ఉన్నారు...

ఈ నిర్మాణం జరగడానికి పెద్ద కథే ఉంది.

**స్వ**ర్ణయుగంగా పిలువబడే నాటి ప్రముఖ తెలుగు చలనచిత్ర నటుడు నాగయ్య అంకురార్పణ చేశారు. ఇక్కడ స్థలాన్ని కొనుగోలు చేసారు. ఎందరో తెలుగు చలనచిత్ర రంగ ప్రముఖులు ఇక్కడ అరంగేట్రం చేశారు. మరెందరో సంగీత ప్రముఖులు గానాభిషేకం చేసారు. చెన్నైలో తెలుగువారి ఖ్యాతికి శాశ్వత చిరునామాగా సమున్నతంగా నిలిచిన తెలుగువారి మధుర స్మృతులు లేవు.

**1944** నాటి సంఘటన.. ఆ రోజు.. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు హోరున వాన కురుస్తోంది. ఎవ్వరూ గడప దాటి బయటకు రాలేనిపరిస్థితి అది. కానీ ఆ రోజు టి.నగర్ బస్టాప్ జనంతో కిటకిటలాడిపోతోంది. గొడుగులు ధరించినవారు, ధరించనివారు కూడా ఆ కుంభవృష్టిలో తడుస్తూ నిలబడ్డారు. సరిగ్గా అదే సమయానికి కారులో అటుగా వెళ్తున్నారు నాగయ్య, జి.ఎన్. బాలసుబ్రహ్మణ్యం కచేరికి వెళ్లడం కోసమే వారంతా వానను సైతం లెక్కచేయట్లేదని తెలుసుకుని వేదనపడ్డారు.

**చె**న్నైలోని మైలాపూరు కర్ణాటక సంగీతానికి పట్టుకొమ్మ. సంగీతామృతాన్ని ఆస్వాదించేవారంతా మైలాపూర్ వెళ్ళాల్సిందే! వానకు జడిసి ఇంట్లో కూర్చుంటే కచేరిని వినలేకపోతామనేంత నిబద్ధత కలవారు. వీరికిసంగీతం పట్ల ఆసక్తిమెండు. సంగీత ప్రేమికులైన వీరందరికి టి.నగర్‌లోనే ఒక సభ నిర్మిస్తే ఏ ఒడిదొడుకులు లేకుండా సంగీతంలో తన్మయులు కావచ్చు – అని నాగయ్య మదిలో ఆలోచన తళుక్కుమంది. ఆలోచన వచ్చిందే తడవుగా ఆచరణలో పెట్టేప్రయత్నం చేసారు.

ఆయన శ్రమ వృథాపోలేదు. నాగయ్యగారి సదుద్దేశానికి చేయూత లభించింది. జిఎన్ చెట్టి డాక్టర్‌నాయర్ రోడ్డు సంగమ స్థానంలో ఉన్న 24000 చదరపు అడుగుల ఖాళీ స్థలానికి యజమాని అయిన ప్రముఖ న్యాయవాది టిఏ రంగాచారి నామమాత్రపు ధరకు లీజ్‌కి ఇచ్చారు. నాగయ్య అనేకమంది సహాయ సహకారాలతో నిర్మాణం చేసారు. నాగయ్యకారణంగా ప్రస్తుతం ఉన్న స్థలంలో ఈసభ రూపుదిద్దుకుంది. ఈ సభకు ఆయన పేరును నిర్ణయిద్దామనుకున్నారు. అయితే ఆయన సున్నితంగా తిరస్కరించి, 'శ్రీత్యాగ బ్రహ్మ గానసభ' పేరు స్థిరపరిచారు. దీని రూపకర్త వి.గణపతి అయ్యర్. ఈ సభను ట్రావన్‌కోర్ రామస్వామి అయ్యర్ నవంబరు 18, 1945న ప్రారంభించారు.

1944లో చిత్తూరు వి. నాగయ్య ప్రారంభించిన ఈసభలో మొట్టమొదటి సంగీత కచేరీ శ్రీ అరియకుడి రామానుజ అయ్యంగార్ చేసారు. ఇందులో వయొలిన్ మీద శ్రీ పప్పు కె.ఎస్. వెంకట్రామయ్య, మదృంగం మీద పాలఘాట్ టి.ఎస్. మణి అయ్యర్ సహకరించారు.మొట్టమొదటి కచేరీ మొత్తం ఖర్చు రూ.5000లు చిత్తూరు నాగయ్య విరాళంగా ఇచ్చారు. 1930 నాటికి పెద్ద సరస్సు ప్రాంతం సంగీతసాగర నిలయంగా మారిపోయింది.

1973లో 'వాణిమహల్' అనే పేరును ఈ సభకు జత చేశారు. వాణీమహల్ అంటే సరస్వతీదేవి నివాసం అని అర్థం. ప్రముఖ హాస్యనటుడు నగేశ్ హిందీ చలనచిత్ర కథానాయిక వహీదా రెహమాన్ ఇక్కడే వారి కళాయాత్ర ప్రారంభించారు. ఓరియంటల్ డ్యాన్సెస్ ప్రారంభ శీర్షిక తమిళనాడు ముఖ్యమంత్రి జె జయలలిత ఇక్కడ నాట్యప్రదర్శన ఇచ్చారు.

చెన్నపట్నంలో ఇది అత్యంత ప్రాచీనమైన సభ. సంగీత ప్రేమికులకు ఇదొక ప్రియమైన వేదిక. ఎం.ఎల్. వసంతకుమారి, కె.జె. జేసుదాసు వంటి ప్రముఖల కచేరీలు వాణీ మహల్‌లో జరిగాయి. ప్రతి సంవత్సరం వాణీమహల్‌లో డిసెంబర్ మాసంలో మార్గళి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. వివిధ కళల్లో నిష్ణాతులైనవారికి 'వాణీ కళా సుధాకర' బిరుదు, లక్ష రూపాయల నగదుబహుమతి కళాకారులకు యిచ్చేవారు.

చిత్తూరు వి. నాగయ్య సుమారు 75 సంవత్సరాలక్రితం నాటిన విత్తనం మహావృక్షమై ఎందరో కళాకారులకు నీడను అందిస్తోంది. నాగయ్య చేసిన నిస్వార్థ సేవకు నిలువెత్తు సాక్ష్యంగా చెన్నై మహానగరంలో ఠీవిగా వాణీమహల్ కనబడుతుంది. ఈ హాలు రూపాలు మార్చుకున్నా మినీహాలు వచ్చినా ఇవన్నీ ఆనాడు నాగయ్య నాటిని కళావృక్ష ఫలాలే.

కానీ ఆ నాలుగు రోడ్లు కూడలిలో నాగయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించాలన్న కోరిక ఫలించలేదు. ఎక్కడో పానగల్‌పార్కులో ప్రతిష్టించారు. నిత్యమూ కాకిరెట్ట అభిషేకం జరుగుతూంది. **(సాక్షి సౌజన్యంతో)**


SRI RAJARAJESWARI JEWELLERY

**The Oldest Jewellery Shop in Pondy Bazaar**

**81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.**
**Phones : 28152387, 28154653**

***The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation***